క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురం టౌన్: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖాధికారి సామల సింహాచలం అన్నారు. నర్సిపురంలోని మూడు ఎంపీపీ పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్ల డైరీలు, లెస్సన్ ప్లాన్లు, వర్క్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఆంగ్ల పాఠ్యాంశాలను బాగా చదివిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శారద, గుడ్ల అమ్మాజీ, సీఆర్‌ఎంటీ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం రేపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా పెన్షనర్ల సంఘం ఆధర్వంలో ఆదివారం స్థానిక రైతుబజార్ వెనుక గల పెన్షనర్ల సమావేశ భవనంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘ కార్యదర్శి గణపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి



పట్టుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

పాచిపెంట: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సమీపంలో ఒడిశా ప్రాంతంలో సారా స్థావరాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్సై నారాయణరావు, ఒడిశా పోలీసులతో కలిసి లావిడి, కాందిలి, ఒలిసి, పులిగుంట, తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. 140 లీటర్ల సారా, 4200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

4800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: మండలంలోని నేరేళ్లవలస సమీపంలో సారా తయారీ కేంద్రంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. 4800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.


25 నుంచి బంగారమ్మ పండగ

మక్కువ: మండలంలోని కొండబుచ్చమ్మపేటలో బంగారమ్మతల్లి ఘటాలను శుక్రవారం గ్రామంలో ఊరేగించారు. ఈనెల 18న అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ప్రతీరోజు ఉదయం అమ్మవారి ఘటాలకు గద్దె వద్ద ఉంచి పూజలు చేయడంతో పాటు సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు బంగారమ్మతల్లి పండగ నిర్వహించనున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

జాగ్రత్తలు తీసుకోవాలి..

సీతానగరం: వేసవి నేపథ్యంలో పశువులను పెంచేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పశు వైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, పశువులను ఉదయం 6 గంటల నుంచి పది వరకు... సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే మేతకు తీసుకెళ్లాలని సూచించారు. మిగతా ఎండ సమయంలో పశువులను చెట్ల కింద, శాలల్లో ఉంచాలన్నారు. పశువుల సాలల్లో చల్లని నీరు అందుబాటులో ఉంచడంతో పాటు పచ్చగడ్డి, సమీకృత దాణా అందించాలని సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే పశువుల ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.

హ్యాట్రిక్ విజయం మీదే..



ఎమ్మెల్యే కళావతికి కేక్ తినిపిస్తున్న సుహాసిని

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని ధీమా వ్యక్తం చేశారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కళావతిని కలిసి అభినందించారు. ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. మూడోసారి పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కళావతి పేరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ విజయోత్సవాల నిర్వహణకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న పాలనే..

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కొత్తవలస పరిధిలో గల గిజబ కాలనీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిందన్నారు. పేదల సంక్షేమానికి సీఎం జగనన్న అగ్ర తాంబూలం ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. పేదరికమే అర్హతగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, వారి జీవన ప్రమాణాలలో పెను మార్పులు తీసుకువచ్చాడని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ప్రభుత్వమే లేదన్నారు. లక్షల కోట్ల రూపాయలు పేదల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేశారని చెప్పారు. పట్టణంలో ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం, ఏ ప్రజాప్రతినిధి చేయనంత అభివృద్ధిని తాను చేసి చూపించానని తెలిపారు.

రానున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి..



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలో ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన బాధ్యత ఎలక్టోరల్ అధికారులదేనని ఎంసీసీ (ఎంపీడీఓ) ఎం. ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు సెక్టార్ సూపర్‌వైజర్ కె. కుమారవర్మ, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధులు మండలంలో పర్యటిస్తున్నాయని చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి చిన్నారావు మాట్లాడుతూ, ప్రధాన కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు



వెంకటాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి నిడగల్లు, వెంకటాపురం, బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం గ్రామాల్లోని 115, 116, 117, 112, 124, 125, 126, 127, 128, 130 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంప్, తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం వెంకటాపురం సచివాలయంలో ఎంసీసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఇంజినీరింగ్ సహాయకులు పైలా శశాంక్, వెల్ఫేర్ సహాయకులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

• ఆర్డీఓ హేమలత



మాట్లాడుతున్న పార్వతీపురం రెవెన్యూ డివిజన్ అధికారి హేమలత

పార్వతీపురం టౌన్: ఈవీఎంలపై అవగాహన తప్పనిసరని ఆర్డీఓ హేమలత అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రిసైడింగ్ అధికారులతో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరచాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు , కటౌట్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నియమ, నిబంధనలను పటిష్టంగా అమలుజరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

మక్కువ: గిరిజన, దళిత గ్రూపులకు ఉపాధి పనులు కల్పించాలని మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు కోరారు. మండల కేంద్రం మక్కువలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ అధ్యక్షుడు పి.సీతారం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వేణు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. వ్యవసాయరంగాన్ని, కార్మికరంగాన్ని దెబ్బతీసేలా తీసుకొచ్చిన నల్లచట్టాలను కేంద్రం వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి వేతనదారుల బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఇందిర, మండలం కన్వీనర్ టి.ప్రభాకర్, సభ్యులు రాజారావు, చంటి, రమణ, మన్మథరావు, గిరిజన సంఘం నాయుకులు పాల్గొన్నారు.

25న డోలాయాత్ర

కురుపాం: మండలంలోని శివ్వన్నపేట జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 25, 26 తేదీల్లో డోలాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బయోటెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న లక్ష్మణనాయుడు

పాలకొండ రూరల్: మొక్కలతో మానవ మనుగడ ముడిపడి ఉందని, జీవసాంకేతిక శాస్త్రంలో వస్తున్న పురోగతి మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ దూబ లక్ష్మణనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జన్యు పరివర్తిత మొక్కలు, వాటి ప్రయోజనాలను వివరించారు. ప్లాంట్ బయోటెక్నాలజీలో వస్తున్న నూతన పోకడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమణి, అధ్యాపకులు జనార్దనరావు, ఉపేంద్రరావు, జగన్మోహనరావు, శంకరబాబు, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు అండగా ఉంటాం..



ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు సంఘీభావం తెలియజేస్తున్న హమాలీలు, ఆటో కార్మికులు

సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అండగా ఉంటామని మండల కేంద్రానికి చెందిన హమాలీలు, ఆటో ఆపరేటర్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అలజంగి, తదితరులు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని మార్కెట్‌లో జె. నాగయ్య ఆధ్వర్యంలో పలువురు హమాలీలు, ఆటో కార్మికులు ఎమ్మెల్యేను కలిసి సంఘీభావం తెలిపారు. జగనన్న హయాంలో తామంతా ఎన్నో పథకాలు పొందామని, ఆయన రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘ నాయకులు, హమాలీలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే..


• జోనల్ మలేరియా నివారణ అధికారి ఎం. శాంతిప్రభ



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ మలేరియా నివారణ అధికారి ఎం. శాంతిప్రభ

పార్వతీపురం టౌన్: క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వరపీడితులను గుర్తించాలని జోనల్ మలేరియా నివారణాధికారి ఎం. శాంతిప్రభ అన్నారు. ఈ మేరకు జిల్లా మలేరియా నివారణ అధికారి టి. జగన్ మోహనరావు ఆధ్వర్యంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులకు శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో రీ ఓరియంటేషన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జ్వరపీడితులను గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. రాబోయే సీజన్‌లో జ్వరాలను అదుపులోఉంచేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. దోమలు వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ.. రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ రెండు రోజులు నిర్వహిస్తామన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామచంద్రరావు, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ అప్పారావు, ఈఓ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పి.కోనవలసలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

పాచిపెంట: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్నారు. మండలంలోని మంచాడవలస, విశ్వనాథపురం, పనుకువలస, పి.కోనవలస గ్రామాల్లో శుక్రవారం ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ఒత్తిడికి, భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ మేరకు ప్రతి ఒక్కరూ నడచుకోవాలని సూచించారు.

ఆరో తరగతిలో అదనపు సీట్లు



పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాల

సాలూరు:

పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆరో తరగతిలో అదనపు సీట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం 80 సీట్లు ఉండగా.. అన్ని సీట్లు భర్తీ కావడంతో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను కలిసి అదనపు సీట్లు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పి.కోనవలస గురుకులంలో అదనంగా 25 సీట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు విద్యాశాఖ 25 సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో 6వ తరగతిలో మొత్తం సీట్లు 105 చేరాయి. జగనన్న అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాల అమలుతో పాఠశాలలో ప్రవేశాలు పెరిగాయి.

ప్రగతిపథంలో శివరాంపురం

• పంచాయతీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
• వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు
• రూ.15 కోట్లతో సంక్షేమ లబ్ధి



శివరాంపురం గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర(ఫైల్)

సాలూరు: నియోజకవర్గానికి ఈశాన్యంగా వేగావతి నదీతీరాన ఉన్న శివరాంపురం గ్రామం నుంచి నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకులైనా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఓ ఆనవాయితీ. ఈ గ్రామంలోని శివాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తే విజయం సాధిస్తారని నమ్మకం. ఇక్కడ నుంచి ప్రచారం మొదలు పెట్టడమే కానీ గ్రామంలోని సమస్యలపై గత పాలకులు దృష్టి సారించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామస్తుల దశాబ్దాల కల సాకారానికి శ్రీకారం చుట్టింది. వేగావతి నదిపై గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి 2007లో అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్థానిక ఎమ్మెల్యే రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ పనులు ప్రారంభించారు. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో పనులు ముందుకుసాగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ప్రత్యేక చొరవతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసింది. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో సీసీరోడ్లు, కాలువలు, కల్వర్టులు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలన్నీ గ్రామస్థాయిలోనే ప్రజలకు అందుతున్నాయి. సంక్షేమ పథకాల అమలుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పంచాయతీ పరిధిలో సుమారు 2248 మందికి సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.15 కోట్లు వరకు లబ్ధి జరిగింది. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేయడంతో పేదల సొంతింటి కల సాకారం అయింది.



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

కోట్లాది రూపాయల సంక్షేమ ఫలాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో మా పంచాయతీకి కోట్లాది రుపాయలు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయి. దశాబ్దాలుగా ఉన్న వంతెన సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందించారు. ఈ ప్రాంత ప్రజలు రాజన్న దొర చేసిన మేలు మరిచిపోలేరు.

– జర్జాపు మోహన్, సర్పంచ్, శివరాంపురం పంచాయతీ



అంగన్‌వాడీ కేంద్రం-1 నుంచి తెలగావీధికి వేసిన సీసీరోడ్డు



రామా కాలనీ నుంచి శివాలయానికి నిర్మించిన సీసీరోడ్డు